# పత్తి రైతు పరేషాన్

- దిగుబడులు రాక దిగాలు
- ధర పతనంతో కుదేలు
- సీసీఐ ఏర్పాటులో తీవ్రజాప్యం


పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు


పూసిన పత్తి చేను..

**బూర్గంపాడు:** ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ ఒడిదుడుకులు పత్తి రైతులను పరేషాన్ చేస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడులు రాకపోవటంతో దిగులు చెందుతున్న పత్తిరైతులకు ధరల పతనం పుండుమీద కారం చల్లినట్లైంది. ప్రభుత్వ మద్దతు ధర దక్కకపోవటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మద్దతు ధరకు పత్తిని అమ్ముకోవాలంటే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఇంతవరకు ప్రారంభించలేదు. దీంతో రైతులు తమ పెట్టుబడి అవసరాల కోసం తక్కువ ధరలకే పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు**

ఈ ఏడాది మణుగూరు, భద్రాచలం వ్యవసాయ డివిజన్‌లలో పత్తి సాగు గతేడాది కంటే పెరిగింది. గత ఏడాది మిర్చిసాగులో రైతులు తీవ్రంగా నష్టపోవటంతో మిర్చి సాగు భూముల్లో కూడా ఈ ఏడాది కొంతమేరా పత్తిని సాగుచేశారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు పత్తిపంటను దెబ్బతీశాయి. భారీ వర్షాలు, వరదలకు పత్తిచేలు బాగా దెబ్బతిన్నాయి. ప్రతికూల వాతావరణంతో పత్తిచేలు ఏపుగా పెరగలేదు. పత్తి సాగుకు రైతులు విపరీతంగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరిగింది. ఈ ఏడాది ఎరువులు, పురుగుమందుల ధరలకు కూడా పెరిగాయి. ఎకరాకు కనిష్ఠంగా రూ.50వేల వరకు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఇంత పెట్టుబడులు పెట్టి ఆరుగాలం శ్రమించిన పత్తి చేలు ఏమాత్రం ఆశాజనకంగా లేవు. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ ఏడాది సగటున ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి దిగుబడులు రావని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**అందని మద్దతు ధర**

ప్రస్తుతం రైతులకు అంతో ఇంతో పత్తి చేతికందుతోంది. పంటల సాగు పెట్టుబడుల కోసం చేతికందిన పత్తిని అమ్మాలంటే మార్కెట్‌లో పత్తిధర రోజురోజుకూ పడిపోతుంది. ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న పత్తిని వ్యాపారులు క్వింటాకు రూ.6వేలకు అడుగుతున్నారు. తక్కువ ధరలకు పత్తిని అమ్మాలంటే రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం పంట సాగు పెట్టుబడులకు అందించే రైతు భరోసాను రైతుల్లో ఖాతాలలో జమచేయలేదు. దీంతో రైతులు ప్రైవేటు అప్పులతోనే పంటలు సాగు చేశారు. ఇప్పుడు కూలీలకు, పురుగుమందులకు డబ్బు అవసరముండటంతో కొత్త అప్పులు చేయలేక పత్తిని తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు.

**సీసీఐ కేంద్రాలు అత్యవసరం**

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాకు రూ.7,521లు మద్దతు ధరను ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో పత్తికి మద్దతు ధరలు దక్కనప్పుడు సీసీఐ ఆధ్వర్యంలో కేంద్రం రైతుల నుంచి మద్దతు ధరలకు పత్తిని కొనుగోలు చేయిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి ధర క్వింటాకు రూ.6వేల వరకు మాత్రమే పలుకుతుంది. దీంతో రైతులు ప్రభుత్వ మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరముంది. అయితే ప్రస్తుత పరిస్థితులను బట్టి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు నవంబర్‌లో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పటి వరకు రైతులు పత్తిని నిల్వచేసుకునే పరిస్థితులు లేవు. దీంతో ప్రైవేటు వ్యాపారులు తేమశాతం పేరుతో రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కాలంటే ప్రభుత్వం జోక్యం చేసుకుని సీసీఐ కేంద్రాలను తొందరగా ప్రారంభించాల్సిన అవసరముంది.

### పెట్టుబడులు కూడా రావు



వ్యాపారులు పత్తిని క్వింటా ఆరువేల రూపాయలకు కూడా అడగటం లేదు. క్వింటా పత్తి తీసేందుకే కూలీలకు రూ.2,500 ఖర్చు వస్తుంది. ఆరువేలకు పత్తిని అమ్మితే పెట్టుబడులు కూడా పూడవు. సీసీఐ సెంటర్‌లు మొదలుపెట్టి పత్తిని కొనుగోలు చేస్తే కనీసం మద్దతు ధరైనా వస్తుంది.

– చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

### నష్టాలు తప్పేలా లేవు..



ఈ ఏడాది భారీ వర్షాలు, వరదలకు పత్తిచేలు దెబ్బతిన్నాయి. పత్తిచేలు పెరగలేదు. ఎన్ని ఎరువులు వేసిన పెద్దగా మార్పు లేదు. వర్షాలు కురిసి, కురిసి ఒక్కసారే ఆగిపోయాయి. దీంతో పత్తిచేలు బెట్టకు వచ్చాయి. దీనికి తోడు ధర కూడా లేకపోవటంతో ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవు.

– ఉడుగుల సత్యం, రైతు, గొమ్మూరు

# కుమురం భీంకు నివాళి


కుమురం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

**అశ్వాపురం:** మండల కేంద్రంలో ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు అధ్యక్షతన ఆదివారం కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్సీ 2024 ద్వారా నూతనంగా ఉపాధ్యాయులుగా నియమితులైన సోయం రమేష్, ఏనిక రవీందర్, కల్లూరి పద్మ, కోండ్రు విజయలను ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్‌తో సన్మానం పొందిన పూనెం వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొడియం బాలరాజు, తంగెళ్ల భద్రయ్య, తోకల చంద్రోశేఖర్, బండ్ల మునీశ్వరరావు, పద్దం సూర్యనారాయణ, శంకర్, పొడియం అనిల్, చాప ముత్తయ్య, వెంకటేశ్వర్లు, కొండయ్య, కుంజా రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ అధికారిగా మణుగూరు వాసి


కుంచపు భార్గవి

**మణుగూరుటౌన్:** ఇటీవల విడుదలైన సింగరేణి ఎక్స్‌టర్నల్ ఫలితాల్లో మణుగూరుకు చెందిన భార్గవి ప్రతిభ చూపింది. సింగరేణి మెనెజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) ఉద్యోగం సాధించింది. ఆదివారం ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు. మున్సిపాలిటీలోని గాంధీబొమ్మ సెంటర్‌కి చెందిన కుంచపు భార్గవి తండ్రి రాజేందర్ చిన్నప్పుడే మృతి చెందగా, తల్లి కుంచపు పద్మ కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తూ కూతురిని ఉన్నత చదువులు చదివించింది. ఈ క్రమంలో సింగరేణి మైనింగ్ ట్రైనీగా ఉద్యోగం లభించడంపై తల్లి కష్టానికి కూతరులు ప్రతిఫలం సాధించింది అంటూ పలువురు ప్రశంసించారు.

# జీవో నం.33ను రద్దు చేయాలి

**మణుగూరుటౌన్:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇద్దరు స్వయం సహాయక సంఘాలతో పెసా కమిటీలను మరచి ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీల జీవో 33ను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు అన్నారు. ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ జనరల్ బాడీ సమావేశం రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మణుగూరులో జరిగింది. ఈ సందర్భంగా సోయం కామరాజు తొలుత కుమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అమలులో ఉన్న చట్టాలను తుంగలో తొక్కి ఇందిరమ్మ కమిటీలు వేయడం సరైంది కాదన్నారు. దీనిపై ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఆదివాసీ మంత్రులు స్పందించాలని, లేని పక్షంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈసాల సురేశ్, తాటి వెంకటేశ్వర్లు, విసి దొటర, బట్టు కనక రాజు, నూప సీతయ్య, తుర్రం రవి, వాగబోయిన శ్రీను, సోలం రమణ, ప్రవీణ్, ప్రవీణ్, మడి రమేశ్, సోలం కుమార్, వాడె రాంబాబు, కుంజా సాయికృష్ణ, గణిబోయిన తరుణ్, రాము, చందా వెంకటేశ్వర్లు, ఇర్ప సుధీర్, నాగేశ్వరరావు ఉన్నారు.

# ప్రయాణం గుంతలమయం

- అధ్వానంగా మణుగూరు–బయ్యారం ప్రధాన రహదారి
- మరమ్మతులు చేసినప్పటికీ ఫలితం శూన్యం

**పినపాక:** మణుగూరు–బయ్యారం ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. మణుగూరు సీఎస్‌పీ సమీపంలోని రెండు కిలోమీటర్ల రహదారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది.

**ఆ రెండు కిలోమీటర్లే..**

మణుగూరు నుంచి బయ్యారం వెళ్లే ప్రధాన రహదారిలో సీఎస్‌పీ దగ్గర రెండు కిలోమీటర్ల మేర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాత్రి వేళల్లో వాహనాలు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేగంతో వచ్చే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి.

**అరకొర మరమ్మతులు**

ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టినప్పటికీ ఫలితం శూన్యంగా కనబడుతోంది. గతంలోనూ ఎన్నిసార్లు మరమ్మతులు చేపట్టినా అది మూడు నాలుగు ముచ్చటగా మారింది. వర్షాకాలం వస్తే రహదారి భారీ గుంతలు ఏర్పడి మరింత అధ్వానంగా మారుతుంది. నిత్యం బొగ్గు, ఇసుక లారీలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. తద్వారా మరింత గుంతలు ఏర్పడి చిన్న వాహనదారులకు నరకం కనబడుతోంది. పూర్తి స్థాయి రహదారి నిర్మాణంతోనే సమస్య పరిష్కారమవుతుంది.


మణుగూరు సీఎస్‌పీ వద్ద రహదారిపై ఏర్పడ్డ గుంత


చిక్కుడు గుంట వద్ద..

# రైతు భరోసాపై బీఆర్‌ఎస్ రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న స్థానిక పోలీసులు

**మణుగూరురూరల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై స్పష్టమైన వైఖరిని తెలిపి రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ ప్రధాన రహదారిపై నాయకులు, కార్యకర్తలు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలు గడుస్తున్నా రైతులకు నేటికీ రైతుభరోసా డబ్బులు జమ చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో.. విషయం తెలుసుకున్న ఎస్సై మేడ ప్రసాద్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాయకులకు నిరసన విరమింపజేయాలని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొంత సమయం తర్వాత వదిలేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు అడపా అప్పారావు, ముత్యంబాబు, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, అక్కి నరసింహారావు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వెంకటయ్య, వీరమనేని చెన్నకేశవులు, బోశెట్టి రవి, రంజిత్, గుర్రం సృజన్, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రభుత్వానిది మొండి వైఖరి’


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి

**పినపాక:** రైతు భరోసాపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. పూర్తిస్థాయి రుణమాఫీ చేయకుండా అబద్ధాలతో కాలం గడుపుతోందని అన్నారు. ఎన్నికల హామీల్లో వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి వెంటనే సన్నబియానికి మాత్రమే బోనసిస్తామని చెప్పటం రైతులను మోసం చేయడమే అని ఆరోపించారు. ఇప్పటికైనా హామీలను అమలు చేయకపోతే నిరసనలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు భవాని శంకర్, వాసు బాబు, గుమ్మడి గాంధీ, కొండేరు రాము, ముక్కు వెంకటేశ్వర్ రెడ్డి, ముక్కు నాసర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్కూల్ బస్ డ్రైవర్‌పై కేసు నమోదు

**భద్రాచలంఅర్బన్:** ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన నేపథ్యంలో ఓ స్కూల్ బస్ డ్రైవర్‌పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన ముదిగొండ ముత్యాలరావు అనే వ్యక్తి ఈ నెల 17న సాయంత్రం 5 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద వెనుక నుంచి ఓ ప్రైవేట్ స్కూల్‌కి చెందిన బస్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆ పక్కనే ఉన్న డివైడర్‌పై పడిపోయాడు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి పరీక్షలు నిర్వహించగా ముత్యాలరావు కుడికాలి మడమ భాగంలో మూడు చోట్ల విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఘటనకు కారణమైన స్కూల్ బస్ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం ముత్యాలరావు కుమారుడు డాక్టర్ రామకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. సదరు స్కూల్ బస్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

**పందెంరాయుళ్లపై..**

**అశ్వారావుపేట:** మండల పరిధిలోని కేశప్పగూడెం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న పందెంరాయుళ్లపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేశప్పగూడెం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై యయాతి, సిబ్బందితో కలసి పందేల స్థావరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నాలుగు కోడి పుంజులు, రూ.6300ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

## లారీని ఢీకొట్టిన బైక్

**ములకలపల్లి:** లారీని వెనుక నుండి బైక్ ఢీ కొట్టిన ఘటనలో గుర్తుతెలియని యువకుడు గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పాతపోలీస్‌స్టేషన్ సమీపంలో దమ్మపేట వైపు వెళుతున్న లారీని, ములకలపల్లి వైపు వస్తున్న బైక్ వెనుక నుండి వైపు ఢీ కొట్టింది. దీంతో ద్వి చక్ర వాహనం నడుపుతున్న యువకుడి తలకు గాయాలయ్యాయి. కాగా ప్రమాదం చోటు చేసుకున్నా లారీని ఆపకుండా ముందుకు వెళుతుండడంతో పోలీసులు వెంబడించి, లారీని అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక మంగపేట పీహెచ్‌సీకి తరలించి, ప్రాథమిక వైద్య చికిత్స అందించారు. ఘటనపై పిర్యాదు అందలేదని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## 26న ‘మాదిగ’ సమ్మేళనం

**అశ్వాపురం:** పిడమర్తి రవి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 26న భద్రాచలంలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మాదిగ సమ్మేళనం జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు అన్నారు. అశ్వాపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య న్యాయ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని, మాదిగల 30 ఏండ్ల కల నేరవేరే సమయం వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం కార్యాచరణ తీసుకుంటున్న సమయంలో ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని ఆరోపిస్తూ మందకృష్ణ కార్యాచరణ తీసుకోవడం బాధాకరమన్నారు.

# ఆకర్షణీయమేగాని.. అనారోగ్యం!

- విచ్చలవిడిగా చిరుతిళ్ల ఉత్పత్తులు
- కనిపించని నాణ్యతా ప్రమాణాలు
- పట్టించుకోని ఆహార తనిఖీ అధికారులు


భద్రాచలంలోని ఓ దుకాణంలో అమ్మకానికి ఉంచిన స్నాక్స్ ప్యాకెట్లు


అమ్మకానికి ఉంచిన నాసిరకం చిప్స్

**భద్రాచలంఅర్బన్:** స్నాక్స్ అంటే ఇష్టపడని పిల్లలు లేరు. కుర్కురే, కరాచి, చిప్స్, ఫింగర్ స్టిక్స్, క్లిప్స్, రింగ్స్, క్రేజీ బాల్, గిఫ్ట్ చాక్లెట్ ఇలా రకరకాల పేర్లతో అనేక తినుబండారాలు మార్కెట్లోకి వస్తున్నాయి. టీకొట్టు, కిరాణాషాపు, బేకరీ, ఫుట్పాత్ వ్యాపారుల వద్ద సైతం ఇవి లభిస్తాయి. రూపాయి నుంచి రెండు, మూడు, ఐదు, పది రూపాయల వరకు వివివిధ పరిమాణాల్లో లభ్యమవుతున్నాయి. చూడగానే నోరూరించేలా స్నాక్స్ ప్యాకింగ్ చేసి ఉండటంతో పిల్లలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. బడికెళ్లే చిన్నారులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో వీటిని కొనుగోలు చేస్తున్నారు. కానీ వాటి వల్ల వచ్చే అనారోగ్యాలను పసిగట్టాల్సి ఉంది.

**హానికర రసాయనాలు..**

ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో లభించే స్నాక్స్ లాంటి చిరుతిండ్లలో కొన్ని నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలనూ వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించే వారే కరువయ్యారు.

**నాణ్యతకు తిలోదకాలు**

బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా.. ఒకట్రెండు అక్షరాలు అటూ, ఇటూ చేసి కొన్ని కంపెనీలు మార్కెటింగ్ చేస్తున్నాయి. భద్రాచలం పట్టణంలోని యూబీ రోడ్డు, మస్జీద్ రోడ్డు, పాత మార్కెట్ తో పాటు తదితర ప్రాంతాల్లో హోల్సేల్ దుకాణాల ద్వారా ఆయా స్నాక్స్ ప్యాకెట్లను భద్రాచలం నియోజకవర్గంతో పాటు బూర్గంపాడు మండల వ్యాప్తంగా ఉన్న చిన్న దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. అంతిమంగా ఇవి స్థానిక పిల్లల వద్దకు చేరుతున్నాయి.


**రూ.కోటి విలువైన సరుకు దిగుమతి**

చెన్నై, విజయవాడ, హైదరాబాద్ పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భద్రాచలం పట్టణానికి దాదాపు రూ.రూ.కోటి విలువ జేసే తినుబండారాలు ప్రతి నెలా దిగుమతవుతున్నాయి. వీటి కోసం ఒక్కో హోల్ సేల్ వ్యాపారి నెలకు రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వెచ్చిస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీ తయారు చేసే కురక్కురే, కరాచి, చిప్స్ తదితర తినుబండారాలు అమ్మితే ఒక ప్యాకెట్‌పై 50 పైసలు కమిషన్ వస్తుంది. నాసిరకం తినుబండారాలు విక్రయిస్తే ప్యాకెట్‌కు రెట్టింపు అంటే రూపాయి కమిషన్ వస్తుండటంతో చాలామంది వ్యాపారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీ చిప్స్ 12 ప్యాకెట్లు ఉండే ఒక షీట్ అమ్మితే రూ.6 కమిషన్ వస్తుంది. అదే నాసిరకం చిప్స్ అమ్మితే రూ.12 వస్తుంది. దీంతో నాసిరకం వాటినే అమ్మేందుకు వ్యాపారులు మొదటి ప్రాధాన్యతనిస్తున్నారు.

**తనిఖీలు నామమాత్రం..**

మార్కెట్లో లభించే చిరు తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, తూనికలు, కొలతల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెద్దమొత్తాలలో ముడుపులు అందవు కాబట్టే పర్యవేక్షణను గాలికొదిలేశారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. చిరుతిళ్లకు సంబంధించి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదనే విమర్శలు ఉన్నాయి.

### జాగ్రత్తగా ఉండాలి..



మార్కెట్లో లభ్యమయ్యే తినుబండారాలు, జంక్ ఫుడ్‌కు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వీటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలతో పాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధు లొచ్చే అవకాశం ఉంది. పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ సీతారామ రాజు, ఎండి, భద్రాచలం

## క్లుప్తంగా

### బీటీ రోడ్డు మంజూరు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**బూర్గంపాడు:** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో బూర్గంపాడు నుంచి సోంపల్లి గ్రామానికి రూ.కోటితో బీటీ రోడ్డు మంజూరైందని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆదివారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో బీటీ రోడ్డు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పాయంకు మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. బీటీ రోడ్డు నిర్మాణంతో బూర్గంపాడు–సోంపల్లి మధ్య రాకపోకలు సులభతరమవుతాయని, ముఖ్యంగా రైతులకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుందని నాయకుతుల తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మహమ్మద్ ఖాన్, బర్ల నాగమణి, మందా నాగరాజు, భజన సతీష్, దాసరి సాంబయ్య, భజన ప్రసాద్, కైపు శ్రీనివాసరెడ్డి, చిప్పా రాజు, శనగా కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా రాములు

**అశ్వాపురం:** అశ్వాపురం మండలం కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన పాడిశెట్టి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మొండికుంటలో జరిగిన సమావేశంలో రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అండెం గంగరాజు, గౌరవ అధ్యక్షుడు చలమల్ల కంట్లమయ్య, గంధసిరి ఉప్పలయ్య, గోపగాని సత్యనారాయణ, పాడిశెట్టి ఖాదర్, చల్లమల రాములు, వీరయ్య పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం


నూతన ఉపాధ్యాయురాలు సౌందర్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో డీఎస్సీ 2024లో ఉపాధ్యాయులుగా ఎంపికైన రోకళ్ల సౌందర్య, అశ్వినిలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఎంపికై మండలంలోని దబ్బనూతులా, శ్రీనగర్ కాలనీల గ్రామాలలోని పాఠశాలలో బాధ్యతలు చేపట్టడంతో గ్రామ పెద్దలు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిరపు రమణారెడ్డి, పంపన శివరావు, జీరి సత్యనారాయణరెడ్డి, నటరాజ్‌స్వామి పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ మంజూరు

**అశ్వాపురం:** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన చిన్నారి పుల్లగిరి నిత్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ చిన్నారి ఆరోగ్యం విషయాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2.50 లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు నిత్యశ్రీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

### చురుగ్గా నిర్వహించాలి

**ములకలపల్లి:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహించాలని సభ్యత్వ నమోదు జిల్లా జాయింట్ కన్వీనర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొలికపోగు ముసలయ్య పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోటోజు రాంబాబు, అత్యం సాయి, అర్చన, గంగ, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

### దుమ్మూధూళి నివారించండి

**మణుగూరుటౌన్:** ఓసీ–2 సైట్, కొండాపురం గనులకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి విపరీతమైన దుమ్ముదూళి ఏర్పడి విధులకు హాజరయ్యే కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు గనుల ద్వారా ఉత్పత్తి అయ్యే బొగ్గును కార్మికులు వచ్చే రహదారి మార్గం ద్వారా రవాణా చేయడం వల్ల రోడ్డుపై దుమ్ముదూళి చేరుతోందన్నారు. అందుకు సంబంధించిన నివారణ చర్యలు చేపటాల్సిన యాజమాన్యం పట్టించుకోకుండా అశ్రద్ధ వహిస్తోందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి కార్మికులు అనారోగ్యం పాలు కాకుండా, సంస్థ ప్రగతి దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416